BALAGAM TV
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ మంగళవారం 19 నవంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4

## ఇంటింటి కుటుంబ సర్వే 65.02 శాతం పూర్తి..

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక, విద్యా ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే సోమవారం నాటికి 65.02 శాతం పూర్తయింది. సోమవారం వరకూ1,16,14,349 నివాసాలలో సర్వే పూర్తి చేయాల్సి ఉండగా, 75,75,647 నివాసాలలో పూర్తయింది. సర్వేలో అత్యధికంగా ములుగు జిల్లాలో 95.3 శాతం అంటే 97,552 ఇళ్లకు 92,928 ఇళ్లలో సర్వే పూర్తి చేసి మొదటి స్థానంలో ఉంది. నల్గొండ జిల్లా 89.1 శాతం అనగా 5,04,542 ఇళ్లకు 4,49,434 హౌస్ హెూల్డ్స్ లలో సర్వే పూర్తి చేసుకొని రెండో స్థానంలో నిలిచింది. జనగామ జిల్లాలో 86 శాతం అనగా 1,59,452 నివాసాలకు 1,37,069 హౌస్ హెూల్డ్స్ లలో సర్వే పూర్తి చేసుకొని మూడో స్థానంలో ఉంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ ఎంసీ) పరిధిలో మొత్తం 25,05,517 ఇళ్లకు 11,10,883 (44.3 శాతం) నివాసాలలో సర్వే పూర్తి చేసినట్లు రాష్ట్ర సమాచార, ప్రసారాలశాఖ స్పెషల్ కమిషనర్ తెలిపారు..

## తెలంగాణలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి

- హెూం మంత్రి లేని పాలన కొనసాగుతోంది
- లగిచర్ల వెళ్తున్న వారిని అడ్డుకోవడం ప్రభుత్వం పిరికితనానికి, పూర్తి అధికార దుర్వినియోగానికి నిదర్శనం.
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

వివరాలు 2వ పేజీలో

## రాబోయే రోజుల్లో మనదే కప్..



- కేసీఆర్ ఫుల్ ఫాంలోకి వస్తాడు ..బీఆర్ఎస్ ను గెలిపిస్తాడు
- ఇది 8పర్సంట్ గవర్నమెంట్. బిల్లులు ఇవ్వాలంటే 8 పర్సంట్ ఇవ్వాలట
- మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా తగ్గించి క్రికెట్, ఫుట్ బాల్, వాలీ బాల్ ఆడండి, శారీరక శ్రమ చేయండి

వివరాలు 3వ పేజీలో

## రాజన్న ఆలయం, వేములవాడ సమాంతరంగా అభివృద్ధి

- 2014 ముందు రాజన్న ఆలయం ఎలా ఉందో.. ఇప్పుడు అలాగానే ఉంది..
- 20న సీఎం సభను విజయవంతం చేయండి..
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.

వివరాలు 2వ పేజీలో

# ట్రై సిటీస్ అభివృద్ధికి రూ.4962 కోట్లు



- వరంగల్- హన్మకొండ- కాజీపేట ట్రై సిటీస్ అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు
- హైదరాబాద్ తర్వాత అతి పెద్ద నగరం
- 2041 మాస్టర్ ప్లాన్‌తో వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో హైదరాబాద్ తర్వాత పెద్ద నగరమైన వరంగల్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఇందులో భాగంగా గతంలో ఎన్నడూ లేని విధంగా వరంగల్- హన్మంకొండ- కాజీపేట ట్రై సిటీస్ అభివృద్ధి కోసం ఏకంగా రూ.4962 కోట్లను కేటాయిస్తూ సర్కార్ సంచలన నిర్ణయం తీసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఆయా పనులకు నిధులు మంజూరు చేసింది.

తెలంగాణ రాష్ట్రానికి రెండో రాజధానికి వరంగల్ పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని రేవంత్ రెడ్డి సర్కార్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి.. ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో.. రాష్ట్రవ్యాప్తంగా ప్రజా విజయోత్సవ సంబురాలు ఘనంగా నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ప్రజా విజయోత్సవ వేడుకల్లో భాగంగా హన్మకొండ, వరంగల్, కాజీపేట ట్రై సిటీల అభివృద్ధికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. నవంబర్ 19న(నేడు) సీఎం రేవంత్ రెడ్డి వరంగల్ పర్యటనకు ముందే.. వరాల జల్లు కురిపించి.. ట్రై సిటీస్ ప్రజలకు శుభవార్త వినిపించింది ప్రభుత్వం.

వరంగల్... కాకతీయ కాలం నుంచి చారిత్రక ప్రాశస్త్యం కలిగిన నగరమని.. తెలంగాణలో రాజధాని హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరమని ప్రభుత్వం పేర్కొంది. అయితే.. ఇలాంటి నగరంపై దశాబ్దకాలంగా నిర్లక్ష్యపు నీడలు కమ్ముకున్నాయని చెప్పుకొచ్చారు. చారిత్రక నగరాన్ని అభివృద్ధి బాటన నడిపించడానికి ప్రజా ప్రభుత్వం నడుం బిగించిందని స్పష్టం చేసింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. 2041 మాస్టర్ ప్లాన్‌తో వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రచించినట్టు సర్కార్ పేర్కొంది. ప్రజా పాలన- ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్టు ప్రకటించింది. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వరంగల్ మహా నగరం అభివృద్ధికి గతంలో ఎన్నడూ లేని విధంగా రూ. 4962.47 కోట్లు కేటాయించింది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో వివిధ విభాగాల పరిధిలో నగరంలో చేపట్టే పనులకు ఈ నిధులు మంజూరు చేసింది.




### వేములవాడ అభివృద్ధికి
# రూ.127.65 కోట్లు మంజూరు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

వేములవాడలో అభివృద్ధి పనులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.127.65 కోట్లు మంజూరు చేసింది. శ్రీరాజరాజేశ్వర ఆలయ కాంప్లెక్స్ విస్తరణ, భక్తుల సదుపాయాలకు రూ.76 కోట్లు కేటాయించింది. వేములవాడ ఆలయం నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు రోడ్ల విస్తరణ చేపట్టనున్నారు. ఇందుకు అవసరమైన భూసేకరణకు ప్రభుత్వం రూ.47.85 కోట్లు మంజూరు చేసింది. బతుకమ్మ తెప్ప నుంచి జగిత్యాల వరకు డ్రైనేజీ నిర్మాణానికి రూ.3.8 కోట్లు కేటాయించింది.

కాంగ్రెస్ ప్రభుత్వం వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి 127 కోట్లు మంజూరు చేయడంతో, వేములవాడ పట్టణ ప్రజలు, వేములవాడ రాజన్న భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిధుల మంజూరీలో ప్రత్యేకంగా కృషి చేసిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈనెల 20వ తేదీన సీఎం వేములవాడ రానున్న నేపథ్యంలో, ఎలాంటి అనర్థాల జరగకుండా జిల్లా పోలీసు ఉన్నతాధికారులు పటిష్ట బందోబస్తు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే మిడ్ మానేర్ జలాశయంలో ప్రాక్టికల్‌గా కోల్పోయిన బాధితులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరి చేస్తూ, సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది.



## పెరుగుతున్న ఈవీ వాహనాల కొనుగోళ్లు

**- తొలిరోజు రాష్ట్రవ్యాప్తంగా 131 వాహనాల కొనుగోళ్లు**

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్ర ప్రభుత్వం నూతన ఎలక్ట్రిక్ వెహికల్ పాలసీని ప్రకటించిన విషయం తెలిసిందే. సోమవారం నుంచి ఈ పాలసీ అమల్లోకి వచ్చింది. ఈవీ వాహనాలకు 2026 డిసెంబర్ 31 వరకు రిజిస్ట్రేషన్, రోడ్డు టాక్స్ చార్జీలను రద్దుచేస్తున్నట్టు రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు జీవో నెంబర్ 41 విడుదల చేశారు. అందులో భాగంగా తొలిరోజు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 131 వాహనాల కొనుగోళ్లు జరగ్గా.. వాటిలో 121 ద్విచక్ర వాహనాలు, 6 కార్లు, ఒక గూడ్స్ క్యారేజ్ వాహనంతో పాటు మూడు ఎలక్ట్రిక్ ఆటో రిక్షాలు ఉన్నాయని హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్(జేటీసీ) సి. రమేష్ ప్రకటించారు.



### గ్రూప్-3 పరీక్షలకు
## 50 శాతం మందే హాజరు

**బలగం టీవి, హైదరాబాద్**

టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మూడు పేపర్లకు కలిపి మొత్తంగా 50 శాతం మందే హాజరయ్యారు. పేపర్1 పరీక్షకు 51.1 శాతం, పేపర్ 2 పరీక్షకు 50.7శాతం హాజరు కాగా, సోమవారం నిర్వహించిన పేపర్ 3కి 50.24 శాతం మంది హాజరైనట్లు టీజీపీఎస్సీ అధికారులు వెల్లడించారు. అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 71.30 శాతం మంది హాజరు కాగా, అత్యల్పంగా వరంగల్ జిల్లాలో 49.93 శాతం మంది హాజరయ్యారు. ఈ గ్రూప్-3 నోటిఫికేషన్ ద్వారా 1363 పోస్టులను భర్తీ చేయనున్నారు.

## కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులు సర్వేలో పాల్గొనాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్**



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కొడుకు, అల్లుడు కేటీఆర్, హరీష్ రావులు కులగణన సర్వేలో తమ కుటుంబాల వివరాలను నమోదు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. ఇప్పటికే ఎమ్మెల్సీ కవిత నమోదు చేసుకున్నందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభినందించారు. సోమవారం సచివాలయంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌తో కలిసి మంత్రి విలేఖరులతో మాట్లాడారు.

ఈ నెల 6న ఈ కార్యక్రమాన్ని గవర్నర్ కుటుంబ వివరాలతో ప్రారంభించామని, 8వ తేదీ వరకు 1,16,14,349 కుటుంబాలను గుర్తించామని చెప్పారు. ఈ నెల 17 (ఆదివారం) వరకు 67,72,246 లక్షల కుటుంబాల వివరాలను నమోదు చేశామని తెలిపారు. న్యాయపర ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ కులగణన కార్యక్రమాన్ని మొదలుపెట్టినట్టు చెప్పారు. ఈ నెల 30 వరకు కులగణన పూర్తవుతుందని, వివరాలను క్రోడీకరించి ప్రజలకు ఆన్‌లైన్ అందుబాటులో ఉంచుతామని చెప్పారు. ఏ కుటుంబానికి ఏ అవసరం ఉంటుందని ఈ సర్వే ద్వారా తేలనుందని, రాష్ట్రంలో చేపట్టిన ఈ కార్యక్రమం దేశానికే రోల్ మోడల్ కానుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు తమ కుటుంబం వివరాలను సైతం కులగ ణనలో ఇప్పటికే నమోదు చేసుకున్నామని, తాను తమ జిల్లా ఖమ్మంలో నమోదు చేసుకున్నట్లు తెలియజేశారు. జిల్లా కలెక్టర్లు , ఆదనపు కలెక్టర్లు ,జిల్లా యంత్రాంగం 75 అంశాల ఫార్మాట్ సర్వే కార్యక్రమంలో బిజీగా ఉన్నారని తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమం పూర్తయిన అనంతరం వాటి వివరాల ప్రకారం ప్రభుత్వ పథకాలను వర్తింపజేస్తామన్నారు.

## లగచర్ల ఘటన.. పరిగి డీఎస్పీ బదిలీ

**బలగం టీవి, హైదరాబాద్**

లగచర్ల కలెక్టర్ పై దాడి ఘటనలో పరిగి డీఎస్పీ కరుణాసాగర్ రెడ్డి పై బదిలీ వేటు పడింది. పరిగి కొత్త డిఎస్పీగా ఎన్.శ్రీనివాస్ ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు డీఎస్పీ కరుణసాగర్ రెడ్డిని డీజీపీ ఆఫీస్‌కి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

### మెట్రో రెండో దశ నిర్మాణానికి
# ప్రైవేటు సంస్థలు ముందుకు రావడం లేదు

**ఎండీ ఎన్వీఎస్ రెడ్డి**

**బలగం టీవి, హైదరాబాద్**



మెట్రో రెండో దశ నిర్మాణానికి ప్రైవేటు సంస్థలు ఏవీ ముందుకు రావడం లేదని మెట్రో రైలు రెండో దశపై ఎండీ ఎన్వీఎస్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మొదటి దశలో ఎల్ అండ్ టీకి భారీగా నష్టం వాటిల్లడమే కారణమని అభిప్రాయపడ్డారు. ఈ అనుభవంతోనే ప్రైవేటు సంస్థలు వెనుకాడుతున్నాయన్నారు. మొదటి దశ మెట్రో కారణంగా ఎల్ అండ్ టీకి రూ.6 వేల కోట్ల నష్టం వాటిల్లినట్లు తెలిపారు. నిర్వహణ కారణంగా ఏడాదికి రూ.1,300 కోట్ల నష్టం వస్తోందన్నారు.

మెట్రో రెండో దశపై సీఎం రేవంత్ రెడ్డి సుదీర్ఘంగా చర్చించినట్లు చెప్పారు. రెండో దశలో మొత్తం 76 కిలోమీటర్ల మేర మెట్రో రైలు నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. మెట్రో రైలు రెండో దశ నిర్మాణం ఎన్నో సవాళ్లతో కూడుకున్నదన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలే మెట్రోను నిర్వహిస్తున్నాయని వెల్లడించారు. బ్యాంకులు కూడా మెట్రోకు అప్పులు ఇచ్చేందుకు అంగీకరించడం లేదన్నారు. అందుకే కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో మెట్రో రెండో దశ నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రికి సూచించినట్లు తెలిపారు. మెట్రో రెండో దశ నిర్మాణం రూ.24,269 కోట్ల ప్రాజెక్టు అని అంచనా వేశారు. ఇందులో 48 శాతం నిధులు జైకా ద్వారా సమకూరుతున్నాయన్నారు. ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపాక కేంద్రానికి పంపించామన్నారు. కేంద్రం నుంచి అనుమతులు రాగానే రెండో దశ పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రజల సహకారం ఉంటే ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేస్తామని తెలిపారు.

## 21న నగరానికి రాష్ట్రపతి

**బలగం టీవి, హైదరాబాద్**



ఈ నెల 21న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరా బాద్‌కు రానున్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న కోటి దీపోత్సవం కార్యక్ర మంలో ఆమె పాల్గొనను న్నారు. అందులో భాగంగా హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అక్కడ భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. పోలీస్, ఆర్ అండ్ బీ, అగ్ని మాపక శాఖ, విద్యుత్ శాఖ, వైద్యారోగ్య శాఖ, జీహెచ్ఎం సీతో నిర్వహించిన కో ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో రాష్ట్రపతి భద్రతా ఏర్పాట్లపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. సెంట్రల్ జోన్ డీసీపీ ఆకాంక్ష్ యాదవ్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్రపతి పర్యటన దృష్ట్యా ఎక్కడ కూడా పొరపాట్లు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. భద్రతా ఏర్పట్లలో పాల్గొనే అధికారుల జాబితాను తమకు అందించాలని కోరారు. అగ్ని మాపక శాఖ పాత్ర కీలకమని అధికారులు అప్రమత్తంగా ఉండాలని వివరించారు. నిరంతరం ఫైర్ సిబ్బంది పర్యవేక్షణ చేయాలని కోరారు. జీహెచ్ఎంసీ ద్వారా పారిశుద్ధ్య పనులు నిరంతరం జరగాలని సూచించారు. స్ట్రీట్ లైటింగ్, లూస్ వైర్లు ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఐదు మెడికల్ స్టాల్స్‌తో పాటు అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ముఖ్యంగా స్టేజ్ ఏర్పాటుపై ఆర్ అండ్ బీ శాఖ ధృవీకరణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ వెంటకాచారి, ఆర్డీఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## జీ 20 సదస్సు ప్రారంభం

**బలగం టీవి, హైదరాబాద్**

జీ 20 దేశాల నేతలు సమావేశమయ్యారు. ఆకలి, దారిద్ర్యం, అసమానతలపై పోరాటమే ప్రధాన ధ్యేయంగా ఈ సదస్సు సాగుతోంది. ఆర్థిక, సామాజిక, పర్యావరణపరమైన సుస్థిర అభివృద్ధి, అంతర్జాతీయ సపరిపాలనకు సంస్కరణలు వంటి అంశాలు ప్రధానంగా చర్చిస్తున్నారు. ఆఫ్రికన్ యూనియన్‌ను కొత్తగా గ్రూపులోకి తీసుకున్న తర్వాత జరుగుతున్న మొదటి సదస్సు ఇది. భారత ప్రధాని మోడీ ఇప్పటికే ఈ సదస్సు కోసం రియో డీ జెనీరో చేరుకున్నారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా ఆయన నైజీరియాలో పర్యటించి సోమవారం రియో చేరుకున్నారు. ఈ మేరకు విదేశాంగ శాఖ ఎక్స్‌లో పోస్టు పెట్టింది. విమానాశ్రయంలో మోడీకి స్వాగతం పలికిన చిత్రాలు కూడా పంచుకుంది. పలువురు ప్రపంచ నేతలతో అర్థవంతమైన చర్చలు జరిపేందుకు తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానంటూ ప్రధాని మోడీ కూడా ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ సదస్సు ముగిసిన అనంతరం ఆయన గుయానా అధ్యక్షుడు మహ్మద్ ఇర్ఫాన్ అలీ ఆహ్వానం మేరకు ఆ దేశం వెళతారు. గత 50ఏళ్ల పై కాలంలో భారత ప్రధాని గుయానాలో పర్యటించడం ఇదే తొలిసారి.

## మణిపూర్, లక్షద్వీప్ కంటే లగచర్ల ఘటన చిన్నదేమీ కాదు..

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్
- మానవహక్కుల సంఘాన్ని కలిసిన కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్**




మణిపూర్, లక్షద్వీప్ కంటే లగచర్ల ఘటన చిన్నదేమీ కాదని.. ఈ ఘటనపై ప్రధాని మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. లగచర్ల బాధితులతో కలిసి ఆయన జాతీయ మానవహక్కుల సంఘాన్ని కలిశారు. అనంతరం బాధితులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో ఏం జరుగుతుందో దేశానికి తెలియాలన్నారు. పేద గిరిజనుల భూములను రేవంత్ సర్కార్ బలవంతంగా గుంజుకుంటోందని కేటీఆర్ ఆరోపించారు. అర్ధరాత్రి పోలీసులు, ప్రైవేటు వ్యక్తులతో కలిసి దళిత రైతుల ఇళ్లపై దౌర్జన్యకాండ జరుగుతుందని.. సీఎం బ్రదర్ గిరిజన రైతులపై దాడి చేసినా కేసులుండవని విమర్శించారు. ప్రజాప్రతినిధి కాకున్నా సీఎం సోదరుడికి కలెక్టర్ స్వాగతం పలుకుతున్నారన్నారు. రాజ్యాంగ రక్షకులమంటున్న రాహుల్ సీఎం నియోజకవర్గంలో దమనకాండ స్పందించాలన్నారు. సీఎం సోదరుడి కంపెనీ కోసమే ఇంతమంది గిరిజనులు బాధపెడుతున్నరని ఆరోపించారు. తెలంగాణలో ఏం జరుగుతుందో తెలియనట్లు బీజేపీ నాటకాలు

మిగితా 2వ పేజీలో

# రాజన్న ఆలయం, వేములవాడ సమాంతరంగా అభివృద్ధి




- 2014 ముందు రాజన్న ఆలయం ఎలా ఉందో.. ఇప్పుడు అలాగానే ఉంది..
- 20న సీఎం సభను విజయవంతం చేయండి..
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

రాజన్న ఆలయ అభివృద్ధితోపాటు,వేములవాడ పట్టణ అభివృద్ధి సమాంతరంగా ఉంటుంది అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. 2014 ముందు రాజన్న ఆలయం ఎలా ఉందో, ఇప్పుడు కూడా అలానే ఉందని చెప్పారు. ఈ నెల 20 ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేములవాడ పర్యటనకు వస్తున్న సందర్భంగా సోమవారం వేములవాడ పట్టణంలోని మహాలింగేశ్వర గార్డెన్స్ లో నిర్వహించిన రాజన్న సిరిసిల్ల జిల్లా స్థాయి కాంగ్రెస్ నాయకుల విస్తృత స్థాయి సమావేశానికి మనకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ లతో కలిసి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ రాజన్న ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేస్తూ, విస్తరణ చేపడుతున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 2023-24 బడ్జెట్ లో రాజన్న ఆలయానికి రూ. 50 కోట్లు నిధులు కేటాయించడం జరిగిందని అన్నారు.కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏటా రూ. 100 కోట్లు కేటాయిస్తామని మోసం చేసి, రంగు రంగుల బ్రొచర్లతో కాలం వెళ్లదీసారని, కాంగ్రెస్ పార్టీ గాని, కాంగ్రెస్ నాయకులు గాని ఎప్పుడూ కూడా అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని చెప్పకున్నా, రూ. 50 కోట్లు నిధులు ఆలయ అభివృద్ధికి కేటాయించి, బుధవారం సీఎం చేతుల మీదగా ఆలయ విస్తరణకు శంకుస్థాపన చేపడుతున్నామని అన్నారు.

2018 జూన్ లో మిడ్ మానేరు ముంపు గ్రామాల ప్రజలకు ఆశల పల్లకి చూపించాడని,ఆనాడు డబుల్ బెడ్ కింద 5 లక్షలు ఇస్తానని కెసిఆర్ మోసం చేశాడని అన్నారు.ఆనాడు ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రులకు పాలాభిషేకాలు చేశారు కానీ,ఏ ఒక్కరికి కూడా 5 లక్షల పరిహారం ఇవ్వలేదు లేదు అని అన్నారు.ఆనాడు ముంపు గ్రామాల సమస్యలు పరిష్కారం నికి పిసిసి హెూదాలో రేవంత్ రెడ్డి,బట్టి విక్రమార్క పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, మేడిపల్లి సత్యం,అడ్లూరి లక్ష్మణ్, కకవ్వంపల్లిసత్యనారాయణ ముంపు గ్రామంలో సమస్యలపై అనేక పోరాటలు చేశారు అని అన్నారు.ఆనాడు సీఎం రేవంత్ రెడ్డి ఆనాడు సంకేపల్లి లో పల్లె నిద్ర చేసి, ముంపు గ్రామాల ప్రజలకు ఒక భరోసా కల్పించారు అని,ఆనాడు ఇచ్చిన మాట ప్రకారం ముంపు గ్రామాల ప్రజలకు 4696 ఇండ్లకు 230కోట్ల లను మంజూరు చేశారని,మేము అధికారంలోకి వచ్చి 11 నెలల్లోనే ముంపు గ్రామాల ప్రజలకు 5 లక్షల మంజూరు చేశామని అన్నారు.నేతన్నల 30 సంవత్సరాల చిరకాల కోరిక అయినయారన్ డిపో,గత ప్రభుత్వం నెంబర్ 2 గా ఉన్న యువరాజు కూడా తెలెక పోయాడు అని,కానీ రేవంత్ రెడ్డి నాయకత్వం లో మంజూరు చేయడం జరిగింది అని అన్నారు.వేములవాడ పట్టణంలో 3వ బ్రిడ్జికి ఆనాటి ప్రభుత్వం భూసేకరణ కూడా చేపట్టలేదు, మా ప్రభుత్వం వచ్చిన తర్వాత భూసేకరణ కోసం 6 కోట్ల నిధులు, అదేవిధంగా ప్యాకెజి 9 లో భాగంగా మల్కాపేట రిజర్వాయర్లో మిగిలిపోయిన పనులకు 9 కోట్లు మంజూరు చేయడం జరిగింది అని అన్నారు.నన్ను ఓడకొట్టడానికి 2018 లో హరీష్ రావు సూరమ్మ చెరువు ప్రోజెక్ట కు శంకుస్థాపన చేసి తట్టెడు మట్టి కూడా తీయలేదు అని,కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కలికోట సూరమ్మ చెరువు కుడి ఎడమ కాలువల భూసేకరణ కోసం 10 కోట్ల నిధులు,సూరమ్మ చెరువు ప్రోజెక్టల కోల్పోయిన బోరు బావులకు, మర్రిపల్లి రిజర్వాయర్, లచ్చ పేట రిజర్వాయర్, మిగిలిన భూసేకరణ కోసం 4 కోట్లు నిధులు మంజూరు చేసిందని అన్నారు.ఆనాడు వైఎస్ రాజశేఖరరెడ్డి 1737 కోట్లతో శ్రీ పాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ కు అంకురార్పణ చేశారు,2009 కి ముందే చందుర్తి, ఫాజుల్ నగర్, రుద్ర%శీ%గి ప్రోజెక్టుల పూర్తి అయ్యాయని,ప్రజా ప్రభుత్వం లో మళ్ళీ ఇప్పుడు కలికోట సూరమ్మ చేరువు,మర్రిపల్లి రిజర్వాయర్ పనులు ప్రారంభం అయ్యాయని అన్నారు. రేవంత్ రెడ్డి పర్యటన పర్యటన ద్వారా మన ప్రాంతం మరింత అభివృద్ధి కి దోహద పడుతుందిఅని, కావున పట్టణాల నుండి గ్రామాల నుంచి బారి ఎత్తున ప్రజలు పాల్గొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు.




## జాల కథల సంపుటికి" కువెంపు భాషా భారతి" అనువాద పురస్కారం..

**బలగం టీవీ , సిరిసిల్ల**

కర్ణాటక ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన రాష్ట్రస్థాయి కువెంపు భాషా భారతి పురస్కారాలలో అనువాద విభాగంలో పురస్కారానికి 'జాల' కథల సంపుటి ఎంపికైంది. తెలంగాణ ప్రసిద్ధ కథ రచయిత పెద్దింటి అశోక్ కుమార్ రాసిన 12 కథలను బెంగళూరుకు చెందిన రచయిత్రి ఎంజి శుభ మంగళ కన్నడలోకి అనువదించగా 'జాల' పేరుతో వంశీ పబ్లికేషన్స్ పుస్తకంగా ప్రచురించారు. దీనికి అనువాద విభాగంలో కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ కువెంపు భాష పురస్కారం ప్రకటించింది. పురస్కారం కింద అనువాదకురాలికి 25వేల నగదు తో పాటు ప్రశంసపత్రము జ్ఞాపిక అందజేస్తారు

# దేవాలయం సమీపంలో పేలుడు

- గాయపడిన పూజారి

**బలగం టీవీ , హైదరాబాద్**

హైదరాబాద్ శివారులోని ఓ దేవాలయం సమీపంలో సోమవారం పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఆలయ పూజారి గాయపడ్డారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధి మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీగూడ రోడ్డులో గల ప్రజాపతి శ్రీశ్రీశ్రీ యాదే మాత ఆలయం సమీపంలో ఈ పేలుడు జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పూజారి ఆలయం వెలుపల పేవ్‌మెంట్‌పై చెట్లను తొలగిస్తున్న సమయంలో ఈ పేలుడు చోటు చేసుకుంది. పూజారి సుగుమరాంను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ఇది మార్వాడి సమాజ్‌కు చెందిన దేవాలయం. పేలుడుతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

విషయం తెలియగానే పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. ఆ ప్రాంతాన్ని బాంబ్ స్క్వాడ్ క్షుణ్ణంగా తనిఖీ చేసింది. పేలుడుకు గల కారణాలపై ఫోరెన్సిక్ బృందం విచారణ చేపట్టింది. ఆధారాలు సేకరించేందుకు పోలీసుల బృందాన్ని రంగంలోకి దించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి ఒకరు వెల్లడించారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (రాజేంద్రనగర్) టి.శ్రీనివాస్, స్థానిక కార్పోరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి సంఘటన స్థలాన్ని

# తెలంగాణలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి

- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**బలగం టీవీ , హైదరాబాద్**

కాంగ్రెస్ హయాంలో తెలంగాణ లో ఆడబిడ్డలకు రక్షణ లేకుండా పోయింది పరిపాలన వైఫల్యంతో పాటు శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ "మియాపూర్ అంజయ్యనగర్ కాలనీకి చెందిన బాలిక ఈ నెల 10వ తేదీన మిస్ అయి.. ఇవాళ తుక్కుగూడలో శవమై కనిపించింది.తల్లిదండ్రులు మిస్సింగ్ కంప్లయింట్ ఇచ్చి వారం రోజులు దాటినా.. పోలీసులు కనీసం పట్టించుకోలేదు. లైంగికదాడి చేసి ఓ ప్లాస్టిక్ పరిశ్రమలో బాలికను పడేసి పోయారు. పోలీసుల వైఫల్యం వల్లే తమ కూతురు బలైందని బాధిత తల్లిదండ్రులు ఏడుస్తున్నారు. ఇంత మంది పోలీసులు, సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ రూమ్ ఒక బాలికను కాపాడలేకపోయాయి. రాష్ట్రంలో హెూంమంత్రి లేని పాలన కొనసాగుతుంది హెూమంత్రి ఎక్కడ.." అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు..

"ప్రశ్నించే వారిని, బాధితుల పక్షాన కొట్లాడుతున్న లీడర్లను అరెస్ట్ చేయిస్తున్న రేవంత్‌రెడ్డికి అమ్మాయిలపై జరుగుతున్న అఘాయిత్యాలు కనిపించడం లేదా అని అన్నారు సంగారెడ్డి జిల్లాలో నడి రోడ్డుపై తల్లీకొడుకులను నరికి చంపారు. హైదరాబాద్‌లో హత్యలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. కాంగ్రెస్ సర్కారుకు పాలన చేతకావడం లేదు. శాంతి



భద్రతల పరిరక్షణపై పట్టింపు లేదు" అని అన్నారు.

**బీజేపీ ఎంపీలు, బీజేఎల్పీ నేతను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**


బీజేపీ ఎంపీలు, బీజేఎల్పీ నేతను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. "ప్రజాప్రతినిధులుగా లగిచర్ల వెళ్తున్న వారిని అడ్డుకోవడం ప్రభుత్వం పిరికితనానికి, పూర్తి అధికార దుర్వినియోగానికి నిదర్శనం. రాష్ట్ర ప్రభుత్వం పేదల పట్ల అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. పేదలకు అన్యాయం చేస్తూ కేసులు నమోదు చేయడం దుర్మార్గం. ఇలాంటి ఘటనలపై వాస్తవాలను తెలుసుకునేందుకు వెళ్తున్న ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం దురదృష్టకరం. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకోబడిన స్థానిక పార్లమెంట్ సభ్యురాలు డికే అరుణ గారితోపాటు ఈటెల రాజేందర్, మహేశ్వర్ రెడ్డిలను అడ్డుకొని అరెస్టు చేయడం రాష్ట్ర ప్రభుత్వ అహంకార ధోరణి ని వెల్లడిస్తోంది. పేదల పక్షాన ప్రజా ప్రతినిధులు ఉండాల్సిన అవసరం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ప్రతినిధులను అరెస్టు చేయించడం.. ప్రజాస్వామ్యంగా ఎన్నుకోబడిన నేతలపై దాడులు చేయించడంగానే భావిస్తున్నాం.

ప్రజా ప్రతినిధులను ఆ ప్రాంతాన్ని పరిశీలించేందుకు పోలీసులు అనుమతించడం లేదంటే.. రాష్ట్ర ప్రభుత్వం తప్పు చేసింది అని పూర్తిగా అర్థమవుతోంది. తప్పుడు కేసులు నమోదు చేసి రాష్ట్ర రైతాంగాన్ని పరోక్షంగా భయభ్రాంతులకు గురిచేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ, నిరంకుశత్వ, నియంతృత్వ విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నాం.

బాధితులతో మాట్లాడి, ఒప్పించి భూసేకరణ చేయాల్సిన సర్కారు.. గిరిజన బిడ్డలపై పోలీసులతో దమనకాండ సృష్టిస్తోంది. కరెంట్ తీసేసి.. మహిళలు, చిన్నపిల్లలు ఉన్నారని కూడా పోలీసులు అభ్యంతరకర పరిస్థితిలో రాత్రికి రాత్రే అక్రమ అరెస్ట్‌లు చేస్తున్నారు. నాడు కేసీఆర్ సర్కారు.. ఖమ్మంలో రైతుల చేతికి బేడీలు వేస్తే.. ఇప్పుడు రేవంత్ సర్కారు రైతులను జైలులో పెట్టింది. జైలులో ఉన్న రైతులతో బీజేపీ నాయకులు ఇవాళ మాట్లాడారు.

ఇందిరమ్మ రాజ్యమంటే.. ఆడబిడ్డలపై దాడి చేయడమేనా రేవంత్ రెడ్డి ? ఇందిరమ్మ రాజ్యమంటే.. పేద గిరిజనుల భూములను అక్రమంగా గుంజుకోవడమేనా..? అరెస్ట్ చేసిన బీజేపీ నాయకులను వెంటనే విడుదల చేయాలి. ప్రజల బాధలను అర్థం చేసుకుని వాటిని పరిష్కరించాల్సిన ప్రభుత్వం నిరంకుశత్వంగా వ్యవహరిస్తే.. ప్రజలు సరైన బుద్ధి చెబుతారు" అని అన్నారు.

# గ్రూప్-3లో కులంపై ప్రశ్న.. ఆర్ఎస్ ప్రవీణ్ తీవ్ర అభ్యంతరం



120. Which of the following statements on Sanskritization in India are correct ?
A. It refers to a process, in which members of a low caste change their customs and rituals collectively.
B. As part of the process, the members of a low caste emulate the ways of life of a high caste collectively.
C. Through sanskritization, members of a low caste attempt to come out of the caste system collectively.
Choose the correct answer :
(1) B and C only (2) A and C only
(3) A, B and C (4) A and B only

భారతదేశంలో సంస్కృతీకరణపై కింది ప్రకటనలలో ఏవి సరైనవి ?
A. తక్కువ కులానికి చెందిన సభ్యులు తమ పద్ధతులు మరియు ఆచారాలను సమిష్టిగా మార్చుకునే ప్రక్రియను ఇది సూచిస్తుంది.
B. ఈ ప్రక్రియలో భాగంగా, తక్కువ కులానికి చెందిన సభ్యులు ఉన్నత కులం యొక్క జీవన విధానాలను సమిష్టిగా అనుకరిస్తారు.
C. సంస్కృతీకరణ ద్వారా, తక్కువ కులానికి చెందిన సభ్యులు కుల వ్యవస్థ నుండి సమిష్టిగా బయటకు రావడానికి ప్రయత్నిస్తారు.
సరైన సమాధానం ఎంచుకొనుము :
(1) B మరియు C మాత్రమే (2) A మరియు C మాత్రమే
(3) A, B మరియు C (4) A మరియు B మాత్రమే

Which of the following statement(s) related to Satyashodhak Samaj is/are correct ?

**బలగం టీవీ , హైదరాబాద్**

గ్రూప్-3లో కులంపై ప్రశ్న.. వివాదాస్పదమవుతోంది. సోమవారం నిగ్రూప్-3 పరీక్షలో తక్కువ కులం, ఎక్కువ కులం అన్న పదాలతో కూడిన ప్రశ్నలను అడగడంపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. ప్రభుత్వ ప్రశ్నాపత్రాల్లోనే ఇలాంటి పదాలు ఉంటే సామాజిక న్యాయం ఎట్ల వస్తది రేవంత్ రెడ్డి గారూ? అంటూ ఎక్స్‌లో ప్రశ్నించారు. మీ సమీకృత విద్యా విధానం చిలుక పలుకులు కేవలం వట్టి మాటలే, నీటి మూటలే అంటూ విమర్శించారు.

గ్రూప్-3 ప్రశ్నాపత్రంలో భారతదేశంలో సంస్కృతీకరణపై కింది ప్రకటనలలో ఏవి సరైనవి? అంటూ ప్రశ్న వచ్చింది. ఇందుకు 3 ఆప్షన్లు ఇచ్చారు.

తక్కువ కులానికి చెందిన సభ్యులు తమ పద్ధతులు, ఆచారాలను సమిష్టిగా మార్చుకునే ప్రక్రియను ఇది సూచిస్తుంది.

ఈ ప్రక్రియలో భాగంగా, తక్కువ కులానికి చెందిన సభ్యులు ఉన్నత కులం జీవన విధానాలను సమిష్టిగా అనుకరిస్తారు.



సంస్కృతీకరణ ద్వారా, తక్కువ కులానికి చెందిన సభ్యులు కుల వ్యవస్థ నుండి సమిష్టిగా బయటకు రావడానికి ప్రయత్నిస్తారు.

ఈ ప్రశ్నలో తక్కువ కులం, ఉన్నత కులం అంటూ పదాలు ప్రస్తావించడం ఇప్పుడు వివాదాస్పదం అయ్యింది. పలువురు ఈప్రశ్నపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నారు.

## హరీష్ రావు నా ఫోన్ ట్యాప్ చేశాడు..

- సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు చక్రధర్ గౌడ్ సంచలన ఆరోపణలు

**బలగం టీవీ , హైదరాబాద్**

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. తాజాగా జూబ్లిహిల్స్ పోలీస్ స్టేషన్ కు విచారణకు హాజరైన సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు చక్రధర్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన ఫోన్ ట్యాపింగ్ అవుతున్నట్టు మెసేజ్ వచ్చిందని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ ముప్పై నంబర్లు జరిపినట్టు అనుమానం వ్యక్తం చేశారు. గతంలోనూ పోలీసులు తనను పిలిచి వివరాలు తెలుసుకున్నారని చెప్పారు. ఈరోజు మరోసారి రావాలని పోలీసులు పిలిచారన్నారు. సిద్దిపేటలో ఓడిపోతాడనే భయంతోనే హరీష్ రావు తన ఫోన్ ట్యాప్ చేశాడని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రంగనాయక సాగర్ స్కామ్ బయటపెట్టానని అందుకే తన ఫోన్ ట్యాప్ చేశారని అన్నారు. కేటీఆర్ సినిమా వాళ్ల ఫోన్లు ట్యాపింగ్ చేస్తే హరీశ్‌రావు రాజకీయనాయకుల ఫోన్లు ట్యాపింగ్ చేశాడని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మీద సిట్ మీద తనకు పూర్తి నమ్మకం ఉందని చెప్పారు. హరీష్ రావుని పిలిచి విచారిస్తే ఫోన్ ట్యాపింగ్ కేసు మొత్తం బయటపడుతుందని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసిన వారిమీద చర్యలు తీసుకోవాలని చక్రధర్ గౌడ్ డిమాండ్ చేశారు.




## 10 వ జోనల్ మీట్‌లో బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థినుల ప్రతిభ

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

రాజన్న జోన్ lll లో 10 వ జోనల్ మీట్ మెదక్ జిల్లాలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల కళాశాల మెదక్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలలో తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లి గురుకుల పాఠశాల కళాశాల విద్యార్థినులు పాల్గొని, అండర్ 14 విభాగంలో ఖో-ఖో ప్రథమ స్థానం అండర్ 17 విభాగంలో, బ్యాడ్మింటన్ జట్టు ప్రథమ స్థానం,అండర్ 19 విభాగంలో బ్యాడ్మింటన్ జట్టు ప్రథమ స్థానం మరియు హ్యాండ్ బాల్ జట్టు ద్వితీయ స్థానం సాధించారు.అథ్లెటిక్స్ అండర్ 17 విభాగంలో జి. రుషిత హైజంప్ గోల్డ్ మెడల్, డిస్క స్ త్రో పి .శరణ్య సిల్వర్ మెడల్, 3 కే రన్ ఇ .సుచరిత సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నారు. జోనల్ మీటిలో ప్రతిభా చాటిన విద్యార్థినిలను పాఠశాల లోని అసెంబ్లీలో ప్రిన్సిపాల్ పద్మా దర్శనాల, వైస్ ప్రిన్సిపల్ రమ్యక ృష్ణ, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వింధ్య మాలతి, పీడీ అలేఖ్య ,పి ఈ టి జ్యోతి మరియు ఉపాధ్యాయ, అధ్యాపక బృందం విద్యార్థినులను అభినందించారు.

# ఆడబిడ్డల నేస్తం... హస్తం పార్టీ

- గత సర్కారు వరంగల్ లో తట్టెడు మట్టిపోయలేదు
- సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో వరంగల్ ప్రగతికి తోడ్పాట్టు
- వరంగల్ గడ్డ కాంగ్రెసుకు ఎప్పుడూ కలిసొచ్చేదే
- సీఎం వరంగల్ టూరును సక్సెస్ చేయండి
- కాంగ్రెస్ శ్రేణులకు మంత్రి కొండా సురేఖ పిలుపు

**బలగం టీవీ , వరంగల్**

ఆడబిడ్డలకు అండదండ... భద్రత, ప్రాతినిథ్యం, ??సాధికారత, సమానత్వం కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఇతర పార్టీలకు మహిళా సంక్షేమం అంటే కేవలం నినాదం మాత్రమేనని... కాంగ్రెస్ పార్టీకి మహిళా సాధికారత ఒక విధానమని చెప్పారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు ఎన్నో మహిళా కేంద్రీకృత పథకాలు, విధానాల రూపకల్పన చేసినట్టు ఆమె చెప్పారు. గత బీఆర్ఎస్ సర్కారు వరంగల్ లో తట్టెడు మట్టిపోయలేదని సురేఖ విమర్శించారు. సోమవారం వరంగల్‌లో ఆమె సభ కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో వరంగల్ ప్రగతికి ప్రభుత్వం తోడ్పాటు చేస్తుందన్నారు. తమ నినాదం, విధానం అభివృద్ధియే అని చెప్పుకొచ్చారు. మహిళా సాధికారితలో మాకు చిత్తశుద్ధి ఉందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో తొలుత కాంగ్రెస్ పార్టీయే జమానాలో ఐసీడీఎస్ సెంటర్లను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేయగా, దాని కారణంగా ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 35,700 అంగన్‌వాడీ సెంటర్లు ఏర్పాటు అయ్యాయని సురేఖ వివరించారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో మహిళా రిజర్వేషన్, 1992-73వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా సాధ్యం అయిందన్నారు. పంచాయితీరాజ్ వ్యవస్థలో సమాజంలోని ప్రతి వర్గానికి%ా% ముఖ్యంగా ఆడబిడ్డలకు ప్రాతినిథ్యం అవసరమని కాంగ్రెస్ పార్టీ బలంగా నమ్మిందని అన్నారు. అందుకే 1992లో 73వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా మహిళలకు 33.3 శాతం రిజర్వేషన్లు తప్పనిసరి చేసిందన్నారు.

ప్రస్తుతం మన రాష్ట్రంలో 12,769 గ్రామాలుంటే ఈరోజు 4,213 మందికి పైగా గ్రామాలు, మండలాలు, జిల్లా స్థాయిలో ప్రజాప్రతినిధులున్నారంటే



అదంతా కాంగ్రెస్ కృషి అంటూ పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఎన్నో కార్యక్రమాలు అమలు పరుస్తుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు, గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లు ఉచిత కరెంటు ఇస్తున్నట్టు వివరించారు. కాగా, వరంగల్, హన్మకొండలు కాంగ్రెసు పార్టీకి ఎప్పుడూ కలిసొచ్చే ప్రాంతాలని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా వరంగల్‌లో భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం వెనుక హన్మకొండ సెంటిమెంట్ ఉందని గుర్తు చేశారు. 2023లో అధికారంలోకి రావడానికి కూడా ఈ జిల్లాలోనే వరంగల్ డిక్లరేషనన్ ఏర్పాటు చేశారని అన్నారు. 2022 మే 6వ తేదిన రైతు డిక్లరేషన్ సభ నిర్వహించింది కూడా ఇక్కడేనని వివరించారు. ఈ రైతు డిక్లరేషన్ సభకు ఆ పార్టీ అధినేత రాహుల్ గాంధీ సైతం హాజరయ్యారని చెప్పారు. కాగా, సోమవారం హనుమకొండ బాలసముద్రంలో నిర్మించిన కాళోజి కళాక్షేత్రాన్ని సీఎం ప్రారంభించనున్నారు. నయీంనగర్ బ్రిడ్జిని అక్కడి నుండే ప్రారంభించి ప్రజలకు అంకితం చేయనున్నారన్నారు. దాంతోపాటు, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేపడతరని తెలిపారు. అదే విధంగా 22 జిల్లాల్లో నిర్మించినున్న స్త్రీశక్తి భవనాల నిర్మాణానికి ఇక్కడే శంకుస్థాపన చేయనున్నారన్నారు.

## మణిపూర్, లక్షద్వీప్ కంటే లగచర్ల ఘటన చిన్నదేమీ కాదు..

(మొదటి పేజీ తరువాయి)

ఆడుతుందని.. సీఎం నియోజక వర్గంలో జరుగుతున్న దమనకాండపై స్పందిం చాలని డిమాండ్ చేశారు. కొడంగల్‌లో 3వేల ఎకరాల్లో ఫార్మా విలేజీ కోసం సీఎం నిర్ణయించారని.. రైతులకు నోటీసులు ఇచ్చి.. వాటిని తిరస్కరించిన వారిని బెదిరిస్తున్నా రన్నారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారం గడువు ముగిసింది.. రాహుల్ ఇప్పటికైనా స్పందించాలని.. రైతులతో చర్చలు జరిపేందుకు ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. ఫార్మా సిటీ కోసం మా హయాంలో 14వేల ఎకరాల భూమిని సేకరిస్తు న్నారని.. తమ హయాంలో ఆ రైతులం దరినీ ఒప్పించి భూములను సేకరించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ఎత్తి చూపితే అక్రమ అరెస్టులు చేస్తున్నారన్నారు.

తమ బీఆర్ఎస్ నేతలందరూ జాతీయ మానవహక్కుల, మహిళా హక్కుల కమిషన్‌ను కలిశారన్నారు. ఎస్టీ హక్కుల కమిషన్ సైతం కలిసి లగచర్ల దమనకాండ వివరించారన్నారు. సీఎం నియోజకవర్గంలో 9 నెలలుగా గొడవలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఎకరానికి రూ.60-రూ.70లక్షల విలువైన భూమికి రూ.10లక్షలు ఇస్తామంటున్నారని.. లగచర్ల అర్ధరాత్రి మహిళలనీ చూడకుండా దాడులు చేశారన్నారన్నారు. గిరిజన రైతులను అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారని.. మణిపూర్ గురించి మాట్లాడే రాహుల్ గాంధీ కొడంగల్ దమనకాండపై ఎందుకు మాట్లాడరు ? మండిపడ్డారు. రాహుల్ గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీ సైతం స్పందించాలని డిమాండ్ చేశారు.రాజ్యసభలో ఈ విషయం లేవనెత్తుతాం.. పార్లమెంట్‌లోనూ ఈ విషయం మాట్లాడాలని కోరుతామన్నారు. లగచర్ల బాధితుల తరపున ఢిల్లీకి బీఆర్ఎస్ శ్రేణులందరికీ ధన్యవాదులు చెబుతున్నా నన్నారు. న్యాల్‌కల్‌తో పాటు పలుచోట్ల భూముల విషయంలో ప్రజలు నిరసనలు తెలుపుతున్నారని.. కందుకూరు, యాచారంలో పర్యటించి రైతుల్లో కాంగ్రెస్ నేతల్లో విషం నింపారన్నారు. అదే 14వేల ఎకరాల్లో ఫోర్త్‌సిటీ, ఫార్మా విలేజీలను ఏర్పాటు చేస్తున్నారని, భూములు ఇవ్వకపోతే తొక్కుతామని సీఎం సోదరుడు అంటున్నాడని మండిపడ్డారు. కొడంగల్ నియోజకవర్గంలో ఇంత ఆందోళన జరిగితే రేవంత్ మహారాష్ట్రలో ప్రచారం చేస్తారా? అంటూ ధ్వజమెత్తారు. ఢిల్లీకి మూటలు పంపుతున్నందుకు రేవంత్ ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటారని.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ఉద్దేశం మాకు లేదన్నారు. కాంగ్రెస్ ఐదేళ్లు ఉంటే మేం పదేళ్లు అధికారంలో ఉంటామన్నారు.

# రాబోయే రోజుల్లో మనదే కప్..

## కేసీఆర్ ఫుల్ ఫాంలోకి వస్తాడు ..బీఆర్ఎస్ ను గెలిపిస్తాడు

- ఇది 8పర్సంట్ గవర్నమెంట్. బిల్లులు ఇవ్వాలంటే 8 పర్సంట్ ఇవ్వాలట
- మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా తగ్గించి క్రికెట్, ఫుట్ బాల్, వాలీ బాల్ ఆడండి, శారీరక శ్రమ చేయండి



**బలగం టీవి, తుర్కయాంజల్**

బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఫుల్ ఫాంలోకి వస్తాడు.. రాబోయే రోజుల్లో కప్ మనదే అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. రంగారెడ్డి జిల్లా తుర్కయాంజల్ జేబీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన తెలంగాణ ఛాంపియన్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌లో హరీశ్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఇది 8 పర్సంట్ గవర్నమెంట్.. బిల్లులు ఇవ్వాలంటే 8 పర్సంట్ ఇవ్వాలట అని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఉద్దేశించి అన్నారు. హైదరాబాద్‌ను పెట్టుబడులకు స్వర్గధామం చేసిండు కేసీఆర్. ఇగురం లేనోడు వ్యవసాయం చస్తే వడ్లు వాగు పాటు, గడ్డి గాలి పాలయ్యిందట. రేవంత్ రెడ్డి పాలన కూడా అట్లున్నది అని హరీశ్‌రావు విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ప్రతిపక్షంలో ఉండి ఫీల్డింగ్, బౌలింగ్, కీపింగ్ బ్రహ్మాండంగా చేస్తున్నది. క్రికెట్‌లో 11 మంది లాగే మంత్రులు 11 మంది ఉన్నారన్నారు. బీఆర్ఎస్ గట్టిగ పోరాటం చేస్తున్నది కాబట్టే వారు పెవిలియన్ దారి పడుతున్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో మనదే కప్. కేసీఆర్ ఫుల్ ఫాంలోకి వస్తడు. మళ్లీ బీఆర్ఎస్‌ను గెలిపిస్తాడు. కేసీఆర్ ఎక్కడ ఉన్నావు అని యాది చేసే కాలం వచ్చింది.

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి డకౌట్ అయ్యారని విమర్శించారు. పేదోళ్ల ఇండ్లు కూలగొట్టడమే రేవంత్ హిట్ వికెట్ అని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీలు బంద్ పెట్టి మూసీ దుకాణం మొదలు పెట్టిండు రేవంత్ రెడ్డి. 31 ఎస్టీపీలు, రూ. 3800 కోట్లతో మూసీ అభివృద్ధిని కేసీఆర్ ప్రారంభించాడు. కాళేశ్వరం ద్వారా గోదావరి నీళ్లను రూ. 1100 కోట్లతో మూసీలో పోయాలని ప్లాన్ చేశారు. మూసీ శుద్ధి చేయాలంటే గోదావరి నీళ్ల తేవాలి. అంతేగాని గరీబోళ్ల ఇల్లు కూలగొట్టడం కాదు. మూసీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తా అంటే బీఆర్ఎస్ ఊరుకోదు అని హెచ్చరించారు. ఆరు గ్యారెంటీలు అన్నడు మోసం చేసిండు. పింఛన్లు, విద్య భరోసా కార్డు, ఉద్యోగాలు ఏవీ లేవు. ఇప్పటి వరకు ఒక్క విద్యార్థికి కూడా స్కాలర్‌షిప్స్ డబ్బులు ఇవ్వలేదు. డిగ్రీ పాస్ అయిన విద్యార్థులకు యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ప్రతి సంవత్సరం రూ. 20 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చారు. ఏడాది అవుతున్నది ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు అని ధ్వజమెత్తారు.

పదేళ్లలో అగ్రస్థానంలో ఉన్న తెలంగాణను 11 నెలల పాలనలో రేవంత్ రెడ్డి అధ:పాతాళానికి తీసుకెళ్లాడు. హైదరాబాద్ చుట్టూ మూడు దిక్కుల సముద్రం అంటడు, దిల్‌సుఖ్‌నగర్‌లో విమానాలు అమ్ముతడు అంటడు. రాజీవ్ గాంధీ కంప్యూటర్ కనిపెట్టిండట. ఇట్ల మాట్లాడుతారు రేవంత్ రెడ్డి. సీఎం మాటలు విని పరీక్షల్లో రాస్తే ఆగమైపోతరు.

తెలంగాణ అమరవీరుల స్మారకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఏటా నిర్వహిస్తున్న ఉద్యమ కారుడు, బీఆర్ఎస్ నాయకుడు నర్సింగరావుకు అభినందనలు తెలిపారు. గెలిచిన టీం కాదు, ఓడిపోయిన టీం కూడా బాగా ఆడారు. గెలుపోటములు చాలా సహజం. భవిష్యత్తులో గెలుపు కోసం పోరాటం చేయాలి అని అన్నారు. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా తగ్గించి క్రికెట్, ఫుట్ బాల్, వాలీ బాల్ ఆడండి, శారీరక శ్రమ చేయండి. ఫిజికల్, మెంటల్ ఫిట్‌నెస్ కోసం క్రీడలు ఉపయోగపడతాయి అని అన్నారు. సోషల్ మీడియా తగ్గించి ఆటలు, చదువు మీద దృష్టి పెట్టండి అని యువతకు హరీశ్‌రావు సూచించారు.

# లగచర్ల బాధితులను వెంటనే విడుదల చేయాలి

- ఎంపీ డీకే అరుణ
- లగచర్ల బాధితులతో బీజేపీ ఎంపీలు ములాఖత్



**బలగం టీవి, హైదరాబాద్**

లగచర్ల బాధితులను వెంటనే విడుదల చేయాలని బీజేపీ ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు. పంతాలు వద్దు నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష ముఖ్యమని తెలిపారు.పేదల ఉసురు పోసుకున్న కేసీఆర్ ఇంటికి పోయారని.. మీరు 11 నెలలకే పేదల ఉసురు పోసుకుంటున్నారని విమర్శించారు. సంగారెడ్డి సెంట్రల్ జైలులోని రిమాండ్ ఖైదీలుగా ఉన్న 16 మంది లగచర్ల బాధితులతో బీజేపీ ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్ సోమవారం ములాఖత్ అయ్యారు.

ములాఖత్ అనంతరం మహబూబ్‌నగర్ ఎంపీ డి.కె.అరుణ మాట్లాడుతూ లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వబోమని రైతులు ఎనిమిది నెలలుగా ఆందోళన చేస్తున్నారని, బలవంతంగా భూములు లాక్కుంటామని అధికారులు చెప్పడంతో రైతులు ఆగ్రహానికి గురయ్యారని తెలిపారు. రైతులు ప్రజాభిప్రాయ సేకరణను బహిష్కరించారని చెప్పారు. వాస్తవంగా ప్రజాభిప్రాయ సేకరణకు రాకపోతే కలెక్టర్ ఒక్కరే ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. పోలీసుల వైఫల్యంతోనే లగచర్ల ఘటన జరిగిందని ఆరోపించారు. సీఎం రేవంత్ సోదరుడు అక్కడ ఉన్న రైతులను భయపెట్టారని తెలిపారు. భూములు ఎలాగైనా గుంజుకుంటామని చెప్పారన్నారు. ఘటన తర్వాత రాత్రి గ్రామాల్లోకి వచ్చి పోలీసులు ఇష్టం వచ్చినట్టు దాడి చేశారని ఆరోపించారు. గొడవ జరిగిన ఘటనలో కాంగ్రెస్ పార్టీ వాళ్లను వదిలేసి మిగతా వాళ్లను అరెస్ట్ చేశారని డికె అరుణ అన్నారు. సీఎం సోదరుడు ఆ గ్రామానికి వెళ్లవచ్చునని, కానీ తనను అక్కడికి వెళ్లకుండా ఎందుకు అడ్డుకున్నారని డీకే అరుణ ప్రశ్నించారు. రైతులతో దౌర్జన్యంగా బెదిరించి సంతకాలు పెట్టించుకుంటున్నారని తెలిపారు. మీరు సీఎం అయితే మా నియోజకవర్గం బాగుంటుందని అనుకుంటే మీరు జనాలపై కక్ష కట్టారన్నారు. సీఎంకు ఫార్మా కంపెనీలపై అంత ప్రేమ ఎందుకని నిలదీశారు. ఓటేసి గెలిపించిన జనాల కంటే మీకు ఫార్మా కంపెనీ ముఖ్యమా అని ప్రశ్నించారు. భూములు ఇవ్వమని చెబితే సీఎం రేవంత్ స్వయంగా వెళ్లి వారిని కలిసి మాట్లాడితే బాగుండేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. కానీ ఇవన్నీ చేయకుండా భయపెట్టి దాడులు చేయించి ఇలా చేయడం కరెక్టు కాదని హితవు పలికారు.

ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ లగచర్ల ఘటన వెనుక కాంగ్రెస్ ప్రభుత్వ కుట్ర ఉందని ఆరోపించారు. బేషరతుగా ప్రభుత్వం బాధితులకు క్షమాపణ చెప్పి వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దుర్మార్గంగా ప్రవర్తించి థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రభుత్వ అవసరాల కోసం భూములు తీసుకోవడం వేరు కానీ బడా కంపెనీలకు అప్పజెప్పడం వెనుక మతలబు ఏంటని ప్రశ్నించారు. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్లుగా కొడంగల్ నియోజకవర్గ రైతుల పరిస్థితి ఉందని చెప్పారు. కాంగ్రెస్ నేతలే ఈ ఘటనకు స్కెచ్ వేసుకుని ఈ దాడులు చేయించారని అంటున్నారని అన్నారు. 144 సెక్షన్ పెట్టి ప్రజాప్రతినిధులను అక్కడికి వెళ్లకుండా ఆపుతున్నారని ధ్వజమెత్తారు. పార్లమెంట్‌లో ప్రివిలేజ్ మోషన్ వేస్తామని అన్నారు.సీఎం రేవంత్ సోదరుడు అరాచకాలు నియోజకవర్గంలో ఎక్కువ అయ్యాయని ఆరోపించారు. నియంతలకు సందర్భం వచ్చినప్పుడు తెలంగాణ సమాజం బుద్ధి చెబుతుందని అన్నారు. గతంలో ఖమ్మం రైతులకు సంకెళ్లు వేసిన వారికి పట్టిన గతే మీకు పడుతుందని హెచ్చరించారు.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు

**బలగం టీవి, ముంబై**

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం నష్టాల్లో ముగిశాయి. విదేశీ మదుపరుల అమ్మకాలు, బలహీన త్రైమాసిక ఫలితాల కారణంగా అమ్మకాల ఒత్తిడి చోటుచేసుకుంది. సెన్సెక్స్ లో స్వింగ్ తీవ్రంగా ఉండింది. సెన్సెక్స్ ఉదయం 77863.54(క్రితం ముగింపు 77580.31) తొలిత లాభాల్లో ప్రారంభమైంది. కానీ తర్వాత కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఇక ఇంట్రాడేలో 76965.06 వద్ద కనిష్ఠాన్ని తాకింది. ఓ దశలో లాభాల్లోకి వచ్చినప్పటికీ లాభాల స్వీకరణతో మళ్లీ నష్టాల్లోకి చేరుకుంది. చివరికి 241.30 పాయింట్ల నష్టంతో 77339 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 78.90 పాయింట్ల నష్టాలతో 23453 వద్ద ముగిసింది. ప్రధానంగా లాభపడిన షేర్లలో హిందాల్కో, హీరో మోటార్ ,టాటా స్టీల్, నెస్లే ఇండియా, హిందుస్థాన్ లీవర్ ఉండగా, ప్రధానంగా నష్టపోయిన షేర్లలో టిసిఎస్, డాక్టర్ రెడ్డి, ఇన్ఫీ, బిపిసిఎల్, సిప్లా ఉన్నాయి. డాలరుతో రూపాయి మారకం విలువ 0.02 పాయింట్లు లేక 0.02 శాతం నష్టపోయి రూ. 84.39 వద్ద ట్రేడయింది. కాగా స్వచ్ఛమైన బంగారం 10 గ్రాములు రూ. 669.00 లేక 0.90 శాతం పెరిగి రూ. 74615.00 వద్ద ట్రేడయింది.


## ప్రశ్నిస్తే సంకెళ్లు.. నిలదీస్తే అరెస్టులా..?



**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్‌ను పోలీసులు మళ్లీ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. దిలీప్ అరెస్టును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రశ్నిస్తే సంకెళ్ల వేయడం.. నిలదీస్తే అరెస్టు చేయడం సరికాదన్నారు నియంత రాజ్యమది.. నిజాం రాజ్యాంగమిది.. అని మండి పడ్డారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎత్తిచూపినందుకే కొణతం దిలీప్ అరెస్ట్.. విచారణకు రమ్మని పిలిచి అక్రమంగా అరెస్ట్ చేస్తారా? అని ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నాళ్లు ఈ అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తావ్! ప్రజాస్వామ్య ప్రేమికులం.. ప్రజాస్వామ్యబద్ధంగానే ఎదుర్కొంటాం! అని తేల్చిచెప్పారు. అక్రమ అరెస్టులకో.. నీ ఉడత బెదిరింపులకో.. భయపడం..! నీ అక్రమ అరెస్టులకు భయపడేవాడు ఎవరూ లేరిక్కడ అని కేటీఆర్ అన్నారు. చివరగా జై తెలంగాణ అని పేర్కొన్నారు.

## ఏసీబీకి చిక్కిన పంచాయితీ రాజ్ ఏఈ



**బలగం టీవి, హైదరాబాద్**

పంచాయతీరాజ్ డిపార్ట్ మెంట్‌లో ఏఈగా పనిచేస్తున్న పాండురంగారావు లంచం తీసుకుంటూ సోమవారం ఏసీబీకి పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ కృష్ణయ్య గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలంలోని రాజశ్రీ గార్లపాడు గ్రామంలో రూ.35 లక్షల నిధులతో మైనార్టీ కమిటీ హాల్ నిర్మాణం చేపట్టారు. నిర్మాణం పూర్తయ్యి ఆరు నెలలు గడుస్తున్నా బిల్లులు కాకపోవడంతో కాంట్రాక్టర్లు మహ్మద్ హుస్సేన్, జగదీశ్వర్ రెడ్డి, లాలు లక్ష్మీనారాయణలు పంచాయతీరాజ్ ఏఈ పాండురంగారావుని కలిసి ఎన్నోసార్లు బతిమాలారు. బిల్లులు చేయాలంటే లక్ష రూపాయలు ఇస్తే తప్ప చేయనని పాండురంగారావు తేల్చి చెప్పాడు. చేసేదేమీ లేక బిల్లుల కోసం రూ.50,000 ఇస్తామని కాంట్రాక్టర్లు ఒప్పందం చేసుకున్నారు. ఆ తర్వాత ఏసీబీ అధికారులకు ముందస్తు సమాచారం అందించారు. సోమవారం యథావిధిగా పాండురంగారావుకి కాంట్రాక్టర్లు ఫోన్ చేసి డబ్బు ఎక్కడ ఇవ్వాలని అడిగారు. ఎర్రవల్లి చౌరస్తాలో ఒక షాపునందు ఇవ్వాలని చెప్పాడు. ప్లాన్ చేసిన కాంట్రాక్టర్లు.. పాండు రంగారావుకు రూ.50000 ఇస్తుండగా

## కడియం శ్రీహరి సవాల్‌ను స్వీకరిస్తున్నా..

- బీఆర్ఎస్ నేత తాటికొండ రాజయ్య



**బలగం టీవి, హైదరాబాద్**

స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో నువ్వైనా ఉండాలి.. నేనైనా ఉండాలని ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేత తాటికొండ రాజయ్య స్పందించారు. కడియం సవాలును స్వీకరిస్తున్నానని చెబుతూ ఒక వీడియోను రిలీజ్ చేశారు.

నియోజకవర్గంలో నువ్వో నేనో మిగలాలని కడియం శ్రీహరి అంటున్నాడని.. ఆయన ఎక్కడ కూడా తనకు పోటీ రాలేదని రాజయ్య అన్నారు. తాను వరుసగా నాలుగుసార్లు గెలిచానని గుర్తుచేశారు. కడియం శ్రీహరి ప్రజా నాయకుడు కాదని.. రాజకీయ నాయకుడు మాత్రమేనని తెలిపారు. కడియం స్థానికేతరుడు అని.. ఆయన్ను తప్పకుండా తరిమికొడతానని అన్నారు. కడియం శ్రీహరి విసిరిన సవాలును స్వీకరిస్తున్నా అని అన్నారు. ‘ నేను ఇక్కడే పుట్టా.. ఇక్కడే పెరిగా.. ఇక్కడే ఉంటా.. రేపు ఛస్తే ఇక్కడే నన్ను బొంద పెడతారు. ‘ అని చెప్పారు. కానీ నిన్ను స్థానికేతరుడిలాగే గుర్తిస్తారని కడియం శ్రీహరిని ఉద్దేశించి రాజయ్య పేర్కొన్నారు. ఆయన్ను పర్వతగిరికి పంపించే వరకు నిద్రపోనని స్పష్టం చేశారు. సత్యహరిశ్చంద్రుడిలా నీతిమంతుడినని కడియం శ్రీహరి డబ్బా కొట్టుకోవడం సిగ్గు చేటు అని విమర్శించారు. ఆయన అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. అవినీతి తిమింగలంలా అయ్యాడని అన్నారు. ఎంపీ ఎన్నికల్లో కడియం శ్రీహరి రూ.100 కోట్లు ఖర్చు చేశారని .. ఆ 100 కోట్లు ఎక్కడివని ప్రశ్నించారు.

# పాక్‌పై ఆస్ట్రేలియా క్లీన్‌స్వీప్



**బలగం టీవీ, హైదరాబాద్**

పాకిస్తాన్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను ఆస్ట్రేలియా క్లీన్ స్వీప్ చేసింది. సోమవారం జరిగిన మూడో టీ20లో ఆసీస్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన పాక్.. 18.1 ఓవర్లలో 117 పరుగులకే ఆలౌటైంది. పాక్ ఇన్నింగ్స్‌లో బాబర్ ఆజమ్ (41) టాప్ స్కోరర్‌గా నిలువగా.. హసీబుల్లా ఖాన్ (24), షాహీన్ అఫ్రిది (16), ఇర్ఫాన్ ఖాన్ (10) రెండంకెల స్కోర్లు చేశారు. ఆసీస్ బౌలర్లలో ఆరోన్ హార్డీ మూడు వికెట్లు ఆడమ్ జంపా, స్పెన్సర్ జాన్సన్ తలో రెండు వికెట్లు.. జేవియర్ బార్ట్‌లెట్, నాథన్ ఇల్లిస్ చెరో వికెట్ పడగొట్టారు.

అనంతరం ఆసీస్ కేవలం 11.2 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేధించింది. మార్కస్ స్టోయినిస్ 27 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో 61 పరుగులు చేశాడు. జోష్ ఇంగ్లిస్ 24 బంతుల్లో 27 పరుగులు.. జేక్ ఫ్రేజర్ 11 బంతుల్లో 18 పరుగులు.. టిమ్ డేవిడ్ 3 బంతుల్లో 7 పరుగులు.. మాథ్యూ షార్ట్ 4 బంతుల్లో 2 పరుగులు చేశారు. పాక్ బౌలర్లలో షాహీన్ అఫ్రిది, జహన్‌దాద్ ఖాన్, అబ్బాస్ అఫ్రిదిలకు తలో వికెట్ దక్కింది. ఈ సిరీస్‌లో ఆస్ట్రేలియా తొలి రెండు మ్యాచ్‌ల్లో కూడా గెలుపొందిన విషయం తెలిసిందే. టీ20 సిరీస్‌కు ముందు జరిగిన వన్డే సిరీస్‌ను పాక్ 2-1 తేడాతో కైవసం చేసుకుంది.





## మహదేవ్ శాస్త్రిగా మోహన్ బాబు

- **కన్నప్ప నుంచి ప్రీ లుక్ విడుదల**

**బలగం టీవీ, హైదరాబాద్**

మంచు విష్ణు కాంపౌండ్ నుంచి వస్తోన్న చిత్రం కన్నప్ప . బాలీవుడ్ డైరెక్టర్ ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో కలెక్షన్ కింగ్ మోహన్ బాబు కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఇప్పటికే సినిమాలోని పలు పాత్రలను పరిచయం చేసిన డైరెక్టర్ తాజాగా మోహన్ బాబు లుక్ షేర్ చేశాడు. ఇందులో మహదేవ్ శాస్త్రిగా కనిపించనున్నట్టు తెలియజేస్తూ ప్రీ లుక్ విడుదల చేశారు. ఫుల్ లుక్‌ను నవంబర్ 22న లాంచ్ చేయనున్నట్టు తెలియజేశారు. ఇందులో మోహన్ బాబు పాత్ర చాలా పవర్ ఫుల్‌గా ఉండబోతున్నట్టు తెలుస్తోంది.




## అక్టోబర్ 2న కాంతారా చాప్టర్ 1

**బలగం టీవీ, హైదరాబాద్**

'కాంతార' చిత్రం ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే.ప్రస్తుతం ఈ సినిమాకు ప్రీక్వెల్‌గా 'కాంతార చాప్టర్ 1' రూపొందుతున్న విషయం తెలిసిందే. రిషబ్‌శెట్టి దర్శకత్వంలో హొంబలే ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కింగరదూర్ నిర్మిస్తున్న ఈ భారీ పీరియాడిక్ డివోషనల్ యాక్షన్ థ్రిల్లర్ శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్‌ను చిత్రబృందం ప్రకటించింది. వచ్చే ఏడాది అక్టోబర్ 2న 'కాంతార చాప్టర్ 1'ని విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు. జయరామ్ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు.

# న్యూజిలాండ్ క్రికెటర్‌పై నిషేధం



**బలగం టీవీ, హైదరాబాద్**

న్యూజిలాండ్ పేసర్ డోగ్ బ్రాస్‌వెల్ నిషేధానికి గురయ్యాడు. కొకైన్ ఉపయోగించినందుకు అతడిని న్యూజిలాండ్ క్రికెట్ నెలపాటు సస్పెండ్ చేసింది. అయితే.. ఈ విషయం చాలా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఈ ఏడాది ఆరంభంలో స్వదేశంలో సెంట్రల్ స్టేజ్, వెల్లింగ్‌టన్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఆ మ్యాచ్‌లో అద్భుతంగా రాణించి డోగ్ బ్రాస్‌వెల్ (2 వికెట్లు, 30 పరుగులు) 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డుకు ఎంపికయ్యాడు. అయితే.. ఏప్రిల్ నెలలో అతడు కొకైన్ తీసుకుని వైద్య పరీక్షల్లో దొరికిపోయాడు. దాంతో న్యూజిలాండ్ స్పోర్ట్స్ కమిషన్ బ్రాస్‌వెల్‌పై కఠిన చర్యలకు సిద్ధమైంది. మరోసారి అలాంటి తప్పిదానికి పాల్పడకుండా మూడు నెలల నిషేధం విధించింది. అయితే.. బ్రాస్‌వెల్ కొకైన్ వాడినందుకు పశ్చాత్తాప పడుతూ.. వైద్యం చేయించుకున్నాడు. అందుకని అతడిపై సస్పెన్షన్‌ను 3 నెలల నుంచి ఒక నెలకు పరిమితం చేస్తూ కివీస్ క్రికెట్ కమిషన్ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే నిషేధం సమయం పూర్తి కావడంతో మళ్లీ దేశం తరఫున ఆడేందుకు బ్రాస్‌వెల్ సిద్ధమవుతున్నాడు.

# కోహ్లీని తక్కువ అంచనావేయొద్దు



- **డేవిడ్ వార్నర్**

**బలగం టీవీ, హైదరాబాద్**

విరాట్ కోహ్లీ గురించి ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్ కీలక వ్యాఖ్యలు చేశారు. కోహ్లీ ఫామ్‌లో లేకపోయినా ఆస్ట్రేలియాకు ఆందోళన తప్పదని వార్నర్ హెచ్చరించాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్‌కు చేరుకోవడానికి ఇరు జట్లకూ బోర్డర్- గావస్కర్ ట్రోఫీ అత్యంత కీలకమైన సిరీస్ అని పేర్కొన్నాడు. ఆస్ట్రేలియాతో సిరీస్ అంటే విరాట్ కోహ్లీ ఉత్సాహంగా ఉంటాడని, అతడు విసిరే సవాల్‌తో ఆతిథ్య జట్టుకు టెన్షన్ తప్పదని తెలిపాడు. బోర్డర్- గావస్కర్ ట్రోఫీలో రాణించి విమర్శకులు నోళ్లు మూయించేందుకు విరాట్ ప్రయత్నిస్తాడని అభిప్రాయపడ్డాడు. గతంలోనూ ఆసీస్ పై విరాట్ కోహ్లీ పూర్తి ఆధిపత్యం చెలాయించాడని.. అందుకే, ఈసారి కోహ్లీ ఉన్న భారత్‌ను చూస్తే ఆస్ట్రేలియా క్రికెట్ తరఫున నాకు ఆందోళనగా ఉందన్నారు. కోహ్లీని పరుగులు చేయనీయకుండా కట్టడి చేస్తే జట్టు విజయావకాశాలు పుష్కలంగా ఉంటాయని తెలిపాడు. దిగ్గజ క్రికెటర్‌ను తక్కువగా అంచనా వేయొద్దు... ఒక్కసారి అవకాశం దొరికితే అస్సలు వదిలిపెట్టడు అని హెచ్చరించాడు.

# "పుష్ప' ఎప్పుడూ తగ్గడు కానీ...

**బలగం టీవీ, హైదరాబాద్**

"పుష్ప' ఎప్పుడూ తగ్గడు కానీ మీ ప్రేమ కోసం తగ్గుతాడు" అంటూ అభిమానులనుద్దేశించి అల్లు అర్జున్ అన్నారు. 'పుష్ప 2' ట్రైలర్ లాంచ్ ఈవెంట్ బీహార్‌లోని పాట్నాలో జరిగింది. ఆయన మాట్లాడారు. "తొలిసారి బిహార్‌కు వచ్చా. ట్రైలర్ ఎలా ఉంది? పుష్ప.. ఫ్లవరు కాదు వైల్డ్‌ఫైరు. గత మూడేళ్లుగా 'పుష్ప 2'.. ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారతీయ చిత్రంగా నిలిచిందంటే కారణం మీ ప్రేమే. ప్రతి ఒక్కరికీ 'పుష్ప' బృందం తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ ఈవెంట్‌కు సహకరించిన బిహార్ పోలీసులకు ప్రత్యేక ధన్యవాదాలు. ఫ్యాన్స్.. మీ సమక్షంలో ట్రైలర్ విడుదల చేయడాన్ని గౌరవంగా భావిస్తున్నా" అని అన్నారు. సుకుమార్ దర్శకత్వం వహించిన ఈ పాన్ ఇండియా మూవీ డిసెంబరు 5న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన ట్రైలర్



లాంచ్ ఈవెంట్‌కు బిహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్‌కుమార్ సిన్హా ముఖ్య అతిథిగా హాజరై, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.




## నయనతార రక్కాయి టైటిల్ టీజర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

డెబ్యూ డైరెక్టర్ సెంథిల్ నల్లసామి దర్శకత్వంలో నయనతార నటిస్తోన్న తాజా చిత్రం రక్కాయి. సోమవారం నయనతారకు బర్త్ డే విషెస్ తెలియజేస్తూ ఈ మూవీ టైటిల్ టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. నయనతార ఏడుస్తున్న పిల్లవాడికి పాలు తాగించి.. మరోవైపు వీరనారిగా రెండు చేతుల్లో ఆయుధాలు పట్టి సమరంలో పాల్గొంటున్న విజువల్స్ గూస్‌బంప్స్ తెప్పిస్తున్నాయి. పీరియాడిక్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ మూవీని డ్రమ్ స్టిక్స్ ప్రొడక్షన్స్, మూవీ వెర్సె ఇండియా సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. పాన్ ఇండియా బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి గోవింద్ వసంత సంగీతం అందిస్తున్నాడు.